


# "ముహూర్తం దాటకుండా...."

ఏం బావా! మా అల్లుడు వచ్చాడా? ... ముఖంపై ముత్యాలలా మెరుస్తున్న స్వేదబిందువులు తుడుచుకొంటూ ప్రశ్నించాడు రమణయ్య. "వాడింతవరకూ రాలేదు అలా ఆ కుర్చీలో కూర్చో. ప్రొద్దుగ్రుంకడానికి దాదాపు మూడు గంటలు వ్యవధి వుందిగా!" పైకి ధైర్యంచూపిస్తున్నా లోలోపల చెలరేగుతూన్న దిగులువలన గద్గదింపబడిన కంఠముతో సమాధానించాడు రామయ్య.

ఇప్పుడేగా ఏదో గుఱ్రపుబండి మన గుమ్మములో ఆగింది! అల్లుడు వేంచేసేడేమోనని తలంచి....గుటకలు మింగుతూ సంశయం వెలిబుచ్చాడు రమణయ్య.

బలేవాడివోయ్ బావా! ఆ బండిలో మా మరదలు, పిల్లలు వచ్చారు. అంత కంగారు పడితే ఎలా? మా శంకరం మనస్సు నీకు అవగాహనకాలేదు. అన్నమాట అక్షరాలా నిలబెట్టుకుంటాడు. వాడు అచ్చంగా వాళ్ల అమ్మమ్మపోలికే! రామయ్య హేళనకు కొంచెమైనా కొంకలేదు రమణయ్య.

నువ్వు నూరుచెప్పు లక్షచెప్పు....ఇల్లాంటి ముహూర్తాలు ఆరు నెలల్లో ఆరవై కేన్సిల్ అయ్యాయి. తమరి సుపుత్రుడు గంభీరంగా ఓ ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ పంపిస్తాడు. మన మా తంతి వార్తతో కుస్తీలుపడుతూంటే ముహూర్తం నిస్సంకోచంగా దాటిపోతుంది. మళ్లీ ఇంకో టెలిగ్రామ్ రాకెట్టులా చేరుతుంది. అందులో 'డోంట్ థింక్ అదర్‌వైజ్ ఎక్స్యూజ్ మి డిసైడ్ అనదర్ సూటబిల్ డే' అని సంప్రదాయసిద్ధమైన ఆంగ్లభాషావైదుష్యం ప్రత్యక్షమౌతుంది. ఏం అనుకుంటే ఏం లాభం లే! ఆ వల్లకాడులాంటి మద్రాసులో అరవవాళ్ల చౌటపకు మన ప్రబుద్ధుడు బోల్తాకొట్టాడు కాబోలు! భార్యతో భావిజీవితం సుఖవంతం చేసికోవాలనైనా వాంఛించటంలేదు. అదిగాక మనవాడు సినీమాపక్షి.

రమణయ్య బావా! నీ వేళాకోళాలకు హద్దు లేదేవిటయ్యా? ఈసారి మా అబ్బాయి దగా చెయ్యడని, దారితప్పడని నా హృదయం గట్టిగా ఘోషిస్తుంది. స్టూడియోలోని ఉద్యోగులందరూ దుష్టవర్తనులేనా? మా శంకరం రచయిత. వాడికా శిఖండి సంతానంతో పొత్తు కలపవలసిన అగత్యం మండిపోవడంలేదు. వెనుకటిరోజులు వేరు. వాడు పేరుపొందిన రైటర్. పెద్దపెద్ద మనుషులతో సహవాసం మరో గొప్ప క్వాలిఫికేషన్. నిముషనిముషానికీ డిన్నర్‌లూ డాన్సుపార్టీలూ మీటింగులు స్విచ్ అరేంజ్‌మెంటులూ అది అమరలోకమయ్యా రామయ్య ఓ అరకప్పు మంచినీళ్ళు పుచ్చుకొన్నాడు.

రచయిత :
బాలకోటీశ్వరరావు

రామయ్య ఆపిన దీర్ఘోపన్యాసం రమణయ్య కొనసాగించాడు. ముమ్మాటికీ సత్యం! కాదంటే నువ్వు మమ్మల్ని బ్రతకనిస్తావా? ఆ అమర లోకంనుండి ఈమర్త్య భువనం ప్రవేశించాలంటే కనీసం పది సంవత్సరాలైనా పడుతుంది. స్పెషల్‌ట్రెయినులో ట్రావెల్‌చేస్తేనే ఈ గడువు. ఆ హీరోగారు ధీరోదాత్తంగా వచ్చేసరికి మా అమ్మాయి ముసలిదై గోవింద నామాలు పాడుకుంటూ 'కట్....కట్ అదిగో బండి మన గుమ్మంలోనే వాడే మా బుచ్చిగాడు! ఆ బూట్లు చూశావా? ఎలా తళతళ వింతకాంతులు వెదజల్లుతున్నాయో! త్వరగా నడు ఎదురువెళ్లి తీసికొద్దాం' ఆనందంతో రామయ్య గడపదాటాడు.

'భగవంతుడా! సకాలంలో మా అల్లుణ్ణి రప్పించిన నువ్వు మహ మంచివాడవయ్యా' రెండుచేతులూ జోడించాడు రమణయ్య.

శంకరంతల్లి సరస్వతమ్మ పడకగదిని అందాలమందిరంగా తీర్చిదిద్దడానికి వ్యయప్రయాసలు ధారపోస్తుంది. ముచ్చటగా కుట్టించుకొని తొడుగుకున్న వెల్వెట్‌జాకెట్ చెమటతో తడిసి చిందరవందరైంది. ఆయిదు గంటలక్రితమే కుదురుగా దువ్వుకొన్న శిరోజాలు కదలి మోముపై వికటనృత్యం చేస్తున్నాయి. విశాలఫాలతలంపై నిలిచిన అర్ధణా కానంత కుంకుమబొట్టూ కరిగి రక్తంలా బుగ్గలపైకి దిగజారుతూంది. పచ్చకాగితం సమర్పించి తెప్పించుకొన్న కంచిపట్టుచీర వదులై కాళ్లకు బందాలువేస్తుంది. అయినప్పటికీ ఆమె హంగామా ఆవగింజంతైనా తిరోగమించలేదు. కొడుకునీ కోడలినీ ఏకంచేసి నూతన యుగాన్ని సృష్టిస్తున్నామనే గర్వం ఆమె హృదయపీఠంపై అధిష్ఠించి ఆజ్ఞలు నిరాటంకంగా ప్రసాదిస్తుంది. ఒక్క క్షణంకూడా కూర్చున్నపాపం చేయలాదామె. క్రొత్తగా రిలీజ్‌అయిన పిక్చర్ చూడాలనే తహతహతో పావలాగేటువద్ద మానవు లనుభవించే ఇబ్బందినే ఆమె సొంతంచేసికొంది.

'ఏయ్! నిన్నేనే మొద్దూ—ఆ తలగడాలు దుప్పటీ అడుగున సర్దవే. ఈ డ్రాయరు కుడివైపున వుంచాలి. కాఫీఫ్లాస్కు మధ్యగాపెడితే బాగుంటుంది. అటోకుర్చీ, ఇటోకుర్చీ మన నివాసంపల్లెలోనైనా పట్నంకళ కొనితేవాలే! అబ్బాయి గదిలో పాదం మోపి పరవశుడవ్వాలి. అసలే మావాడు సుకుమారుడు పరిశుభ్రత కావాలంటాడు. వాడికి నచ్చకపోతే మెయిల్‌యెక్కి తుర్రుమంటాడు. చకచకా పనులు పూర్తవ్వాలి. ఆలస్యం జరుగుతే నే నూరుకోను తెలిసిందా?' చీరకొంగు చివాలున దులిపి నిష్క్రమించింది సరస్వతమ్మ.

"ఆ రంగులరాయడు రానేలేదు. ఈవిడ అదుర్దా మనకు ప్రాణాంతకమైంది. శోభనం పెళ్లికొడుకు మూడు రోజులు ముందుగా

రావాలిగాని ఇలా ఆటంబాంబులా వస్తే ఏం జేస్తాడు? మిఠాయితిని మంచినీళ్లు త్రాగడం అనుకున్నాడో యేమో!" ఇరుగమ్మ మీనాక్షి అభిలాషకు సెభాసన్నారు మిగిలిన మహిళలు.

పడకగది వదిలిన సరస్వతమ్మ తిన్నగా లెఫ్ట్, రైట్ అనుకొంటూ వంటిల్లును దర్శించింది. వంటమనిషి రకరకాల వంటకాలు రుచిచూసి మరీ తయారు చేస్తున్నాడు. సరస్వతమ్మ కంఠం సగర్వంగా ఉరిమింది.

"ఏమయ్యోయ్ వీరబ్రహ్మం! రామయ్య పంతులుగారికొడుకు కార్యమంటే తమాషా చూడడంకాదు. మూడేళ్లకుర్రాడు ఒకటో ఎక్కం వల్లిస్తున్నట్లు పొయ్యిదగ్గఱ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నావ్. నేను చెప్పిన లిస్టులో లోపం వచ్చిందంటే లోపాయకారీగా కాక పబ్లిక్‌గా పరాభవిస్తాను. ఈ వీధిలో సరస్వతమ్మపేరు రామనామంకన్నా ఘాటైన మంత్రం. తలలో పేలు తర్వాత కుక్కుకోవచ్చు. అబ్బాయి రావడానికి వ్యవధి నలభైనిముషాలుంది అటుపైన ఒక్క సెకన్ అలస్యమైనా సందేహించక లెట్ ఫీ వసూలు చేస్తాను. గరమ్ గరమ్ అంటే వేడివేడిగా లడ్డూ జిలేబీ మైసూర్‌పాక్ హల్వా బర్ఫీ దూద్‌పేడ వగైరాలు కమ్మగా తీయగా మా వాడి కిష్టమయ్యేటట్లు వండేసి ప్లేట్లలో ఓపికతో మనోహరంగా సర్దు. కల్తీనూనె వాడకు! మా రంగయ్యవద్ద కొన్న వెన్నకాచిననెయ్యి కావలసినంత సరఫరాచేస్తా' గుండెలుచేత్తో రాసుకొంటూ అదృశ్యమైంది.

వీరబ్రహ్మం మందహాస వదనారవిందుడై రొంటినుండి బీడీతీసి అంటించుకొన్నాడు. ఆ మహారాజు గడపలో కాలుపెట్టనేలేదు. ప్రయాణం బడలిక, ఆ పైన ఈ తల్లివడ్డన మస్తుగా ఆరగించి సుఖనిద్రలో బస్కీలు తీస్తాడు ఘాటుగా పొగపీల్చాడు.

'నా ప్రబోధం గాలికి విసిరేసి బీడీకాల్చుకుంటున్నావా' అదిగోబండి! శంకరం వచ్చేశాడు. వేగిరం కానియ్.'

నీళ్లచెంబు చేతిలో ధరించి చేటంతముఖముతో ముందడుగేసింది సరస్వతమ్మ.

బ్రహ్మం బీడీ ఆర్పి చెవివెనక దాచుకొన్నాడు.

* * *

ఏమిటీ సీతా! నువ్వు మరీను, చిన్నపిల్లలా సంచరించరిస్తున్నావ్! అన్ని చామంతిపూలు నా తలలో తురుముతే నేను భరించలేను సుమా! హైమవతి రాగం ఆలాపించింది.

'నేనుకాదే చిన్నపిల్లను నువ్వు! మా అన్నయ్యకు చామంతులంటే ఆసక్తి ఎక్కువ వాటి సువాసనలు ఆఘ్రాణించి డన్‌లప్‌పిల్లోలా ఊరాలని నా వాంఛ' చిన్నగా నవ్వింది సీత.

పోదూ! ఎప్పటికైనా బదులుకి బదులు తీర్చుకుంటానులే. ఈ పూలకి పదిరెట్లు మల్లెలు నీకు ప్రెజెంట్‌చేస్తాను!

'ఈ చీరాలకేమిలే — మా అన్నయ్యకంట బడితే అయిస్‌లా ద్రవించి జామకాయలా ఘనీభవించి మా మాట మరచేపోతావ్. తెల్లవారనీ! నీ కళ్లకు దళ్లు కట్టబడకపోతే నేను చెవి తెగ్గోయించుకుంటాను' సీత చిలిపపలుకులకు హైమమనసు లోకాంతరంలోతేలింది. "చుట్టూ దృఢప్రాకారాలు బారులుతీరాయి. కనుగవకెదురుగా నరిగంచుతెర విరిసింది. దానిపై చూచాయగా అమెప్రియుడు శంకరం సుందరరూపం సాక్షాత్కరించింది. కోమల హస్తాన్నెత్తి రారమ్మని సైగచేస్తున్నట్లు ఊహించుకొంది. చల్లని పిల్లగాలులు శరీరాన్ని స్పృశించి హాయి నందిస్తున్నట్లు భావించింది! శంకరం చేతులుచాచి తనను సమీపిస్తున్నాడు! బాగా దగ్గఱకు వచ్చేశాడు! ప్రేమతో కోరికతో ఆవేశంతో ఉత్సాహంతో తనను గాఢంగా...." భయంతో నేత్రాలు తెరిచింది! స్నేహితురాలు సీతవంకే తిలకిస్తూ చామంతులదండ కడుతూంది. ముఖం సిగ్గుతో ఎరుపెక్కింది. తీయని ఆలోచనలు మాయమైనందుకు బాధగా 'అబ్బా' అనుకొని తీవ్రంగా ఉచ్ఛ్వాసించింది.

'ఎందుకే అంత గట్టిగా ఊపిరిపీల్చావ్?' అనడిగింది సీత.

హైమవతి పెదవులపై మోదరేఖలు పరుగులుతీశాయి! నెమ్మదిగా అంది.

సీతా! ఈ శుభదినం ఎంతటి మహత్తరమైనదే?

నాకేం తెలుస్తుంది? నేను నీకంటే చిన్నదాన్నేగా! నువ్వేరోజు గొప్పదనం వివరించు! అవాంతరాలు కల్పించకుండా ఆలకిస్తాను! కిలకిల హసించింది సీత.

కనురెప్పలు బరువుగా తెరిచి హైమ విశదీకరించింది! 'సీతా - సతీ పతులకు కుతూహలం రేకెత్తించి భవిష్యత్తు మంజులతమంగా మారేరీతిలో ప్రేరేపించి దివ్యసౌఖ్యాన్ని కరతలామలకంచేసేది ఈ పావనదినమే! ఈ రుచి రసమయంకోసం దంపతులు కరగిపోని కలలుకంటూ చెరగలేని మధురభావనలు సమకూర్చుకుంటూ వేరువేరుగా విహరిస్తారు. ఈనాడు పెద్దల అనుమతితో పిన్నల సహాయముతో దేవతల ఆశీర్వాదబలంతో విడతీయరాని అనుబంధాన్ని అపూర్వ సంబంధాన్ని అద్భుతసంతోషాన్ని .... ఈ ఘడియకొఱకు నేనెన్ని నోములు నోచానో?' సీతని చటుక్కున అలింగనంచేసికొంది హైమవతి. ఆ వేగానికి సీత ఉక్కిరిబిక్కిరైంది.

'నన్నొదిలిపెట్టవే హైమా! నీకు పుణ్యముంటుంది. ఎవరైనా చూస్తే అపార్థాలతో సతమతమౌతారు!—' సీత దీనంగా అర్థించింది! హైమ లక్ష్యపెట్టలేదు! ఉద్విగ్నమానసంతో ఆమె పాలబుగ్గలు కందేలా కరచింది. 'ఛీ! మోటుసరసం నీకు పిచ్చిపట్టిందా? పిశాచం ఆవహించిందా! అదుగో వీధిలో జట్కా నిలిచింది! మీ ఆయనగారు విచ్చేసేరేమో! పోయి వీక్షించి అనంతరకార్యక్రమానికి పునాది రాళ్లు భద్రంచేసికో!—' లలితంగా మందలించింది.

భర్త వచ్చాడన్నవార్త హైమ వీనులకు విందుపచరించింది. అమనిలోని పికగీతి సుస్పష్టంగా వినిపింపజేసింది! లావణ్యానికాటపట్టయిన సుధర్మను కనులకు ప్రదర్శించింది. సీతను త్యజించి లేచినుంచుంది అపార్థమైన వ్రీడ ఆమెకు దూరమవలేదు! రాగరంజితమైన బుగ్గలు రుద్దుకుంటూ సీత తన అమూల్యాభిప్రాయం యిచ్చింది.

'అప్పుడే ఆ సిగ్గంతా ఖర్చుపెట్టకు! రాత్రికి కొద్దిగా అట్టే పెట్టు! ఆ కిటికీప్రక్కన నిలబడితే వీధంతా కనబడుతుంది. కరవుతీరేలా మీభర్తస్వరూపాన్ని పర్యవేక్షించి ధన్యురాలవై చిరకాలం వర్ధిల్లు' నాకుమాత్రం కాజువల్ లీవ్ గ్రేంట్‌చేస్తే బ్రతికి బయటపడతాను—'

'థేంక్స్—నీ సలహా నచ్చింది. నీకు సెలవ్ 'సెంక్షను చేశాం పో—'

హైమవతి కిటికీవైపు నడిచింది. గాజుల గలగలలు శ్రుతిమించి రాగానపడ్డాయి.

* * *

ఊడిపోతూన్న పంచకుచ్చెళ్ళు సవరించుకొంటూ ఒక్క ఉరుకులో అరుగుమీద కొచ్చాడు రామయ్య! ఆయన వదనసీమలో ఆనందోత్సాహాలు సరిసమానంగా చిందులు

త్రొక్కుతున్నాయి! తన అనతిప్రకారం మాట చోటివ్వకుండా పెట్టిన గడువులో బెడ్డింగుతో సహా ఇల్లుచేరుకున్న సుపుత్రుని ఆదరించాలని ఆతృతతో మనిషి మూడింతలు పెరిగాడు. ఒళ్లంతా కళ్ళు మొలిపించుకొని తదేకదీక్షతో బండివంక తిలకిస్తున్నాడు.

ఇదివరలో ఎన్ని ముహూర్తాలో పెట్టించి ఉత్తరం వ్రాస్తే ప్రతీదానికి తన అంగీకార ముద్రవేసి ఫలానా రోజున ఫలానాటైముకి వచ్చేస్తున్నానని టెలిగ్రాములు పంపి చిట్టచివరకు తనను నిరాశాంభోధిలో ముడుమునుంపులు ముంచిన తన అల్లుడు సత్యహరిశ్చంద్రునిలా ఈసారి తతంగంలో తప్పొప్పులపట్టిక అవసరం రాకుండా గౌరవనీయునిలా ఏర్పాటు చేసిన సరంజామా గంగపాలు కాకుండా సద్వినియోగపరచేందుకు వచ్చిన దశమగ్రహాన్ని సందర్శించాలనే దృష్టితో వియ్యంకునికి గజందూరంలో నేలకి తాపడమయ్యాడు రమణయ్య!

హైమవతిని వివాహమాడడానికి ముందుగా ఆ అత్తా కోడళ్లవిషయంలో తల్లి గీచినగీటు దాటనని చేతిలో చెయ్యివేశాడు శంకరం. సరస్వతమ్మ ఆ ధీమాతోనే కొడుకుతో సంప్రదించకుండా తారాబల చంద్రబల సమన్వితంగా సుముహూర్తం నిశ్చయించి తెలియజేసేది. కాని అనందనుడు వాగ్దానికి విరుద్ధంగా చరించి ఆమె అహ్లాదమనే క్షీరసాగరంలో ఉప్పురాళ్లు విసిరేవాడు. పాలు విరగడంతోనే విచారంతో కుంచించుకుపోయేది. కాని ఇవాళ శంకరం తన ఘనమైన ఆజ్ఞను శిరసా వహించి బండిలోంచి దిగుతూండడం చూడాలనే కుతూహలంతో నీళ్లచెంబు చేబట్టి బయటి కరుదెంచిందావిడ!

ఎన్నాళ్లనుండో వేచివేసారిన తనను కరుణించనెంచి ఏతెంచిన పతిని వీక్షించదలచి కిటికీ పూచలమధ్య కళ్లుపెట్టి కాళ్లులాగుతూన్నా లెక్కజేయడంలేదు వయ్యారిభామ హైమవతి!

అకారణంగానే దూరాన ఘోరమైన పిడుగు ఆకాశంనుండి నేలరాలింది. ప్రేక్షకులు దిక్కుతోచక కంపించారు. బండిలోంచి దిగాడో యువకుడు తాపీగా!

'మన శంకరం కాడు — ఎవరో క్రొత్త ముఖం' నీరసంతో మూలిగాడు రామయ్య.

'నేను మొదటే చెప్పాను కదటయ్యా! ఆ హీరోగాడు అక్కడనుండి రాలేదు. ఎవరి పిచ్చి వాళ్లకానందం!' చిరాకుతో రమణయ్య నేలమీద కూలబడ్డాడు. సరస్వతమ్మచేతిలో తపస్సుచేస్తున్న నీళ్లచెంబు వికృతధ్వానంతో భూపతనమైంది!

పొంగివస్తున్న కోపశోకాన్ని నివారించలేక కిటికీరెక్కల్ని దభాలున మూసింది హైమ!

ఆ యువకుడు వీళ్ల పరిస్థితి సున్నితంగా గమనించాడు. రామయ్యను సమీపించి వినయముగా అన్నాడు. 'నమస్కారమండీ! తమరేనా శంకరంతండ్రిగారు? నేను, మీ శంకరం ప్రాణస్నేహితులం. అతనికి సెక్షన్‌మారేజి కారణంగా నేను అతనిచే ఆహ్వానింపబడ్డాను. ఇద్దరం కలిసివచ్చాము. టౌనులో ఏదో ప్రజంటేషన్ కొనాలని దిగిపోయాడు. నన్ను ముందుగావచ్చి మీకీవార్త నివేదించమన్నాడు. ఇంకొక ఇరవై నిముషాలలో అతడు రావడం తథ్యం. కనుక మీ యేర్పాట్లు మీరు చేసుకోండి. చూడండి! ప్రయాణంలో చాలా అలసిపోయాను. ఓ కప్పు కాఫీ యిస్తారా?' గొంతు సరిదిద్దుకున్నాడు.

కూలబడిన రమణయ్య హుషారుగా లేచాడు! నేలకంటుకున్న చెంబుని ఆప్యాయంగా ఉద్ధరించింది సరస్వతమ్మ!

చెక్కిలిపై జాలువారే బాష్పాలు పైటతో ఒత్తుకొంది హైమవతి.

రామయ్య గంభీరంగా వియ్యంకుడితో అన్నాడు—రమణయ్యబావా! మావాడు పితృవాక్యపరిపాలకుడు. శ్రీరామచంద్రునితోసాటి! తెలిసిందా?

రమణయ్య మౌనంగా తలూపాడు.

ఫలహారాలు పూర్తిగా వండేశాను అమ్మగారూ! గావుకేకపెట్టాడు వీరబ్రహ్మం!

'వస్తున్నా తొందరగా ప్లేట్లలోనర్దు!' మెరిసే ముఖంతో సరస్వతమ్మ గృహప్రవేశంచేసింది.

★



జెమినివారి సాంఘికచిత్రం (హిందీ) "పైగాం" లో వైజయంతిమాలా – దిలీప్‌కుమార్‌లు.

'పైగాం' జెమినివారి హిందీ మహత్తర సాంఘికచిత్రం "పైగాం" (సందేశం) లో ప్రధానపాత్రధారులు శ్రీ వైజయంతిమాలా - దిలీప్‌కుమార్‌లు. ఇందులో విశేషమేమంటే వైజయంతిమాలా తల్లి తల్లిగనే యిందులో నటిస్తోంది. జెమినివారి చిత్రాలనుగూర్చి ప్రత్యేకముగ చెప్పవలసిన పనిలేదు. ప్రతిదృశ్యముకూడా స్వభావసిద్ధముగనుండుననుటలో సంశయములేదు. చిత్రజగత్తులో వీరి సృష్టి అపూర్వమనవచ్చు.

ఇపుడు ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడుతోంది.